క్లుప్తంగా

మహానేత జయంతికి ఏర్పాట్లు

కోటవురట్ల : మహానేత, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాస రావు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంతి వేడుకలను ఘనంగా జరపాలని కోరారు. మండల స్థాయిలో మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుక జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేతను పరామర్శించిన బొడ్డేడ



వైఎస్సార్‌సీపీ నేత భూలోకను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో ఇటీవల భార్యను కోల్పోయిన వైఎస్సార్‌సీపీ నేత మళ్ల భూలోకను శనివారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పరామర్శించారు. పార్టీ సీనియర్ కార్యకర్త భూలోక భార్య ధనలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న ప్రసాద్ వాడ్రాపల్లిలో ఆయనను కలిసి పరామర్శించారు. ఆయన వెంట పెతకంశెట్టి రామజోగినాయుడు, బొడ్డేడ సత్యనారాయణ, అప్పలనాయుడు, శివాజీ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో జగన్నాథుని రాట మహోత్సవం



మునగపాకలో జగన్నాథస్వామి రాట మహోత్సవం

మునగపాక : మండల కేంద్రంలో జగన్నాథస్వామి రాట మహోత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మునగపాకలోని జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ముందుగా జగన్నాథునికి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వేపచెట్టుకు మహిళలు పసుపు, కుంకుమ అద్ది రాట మహోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గప్పారావు, వెలగా వెంకట్, ఆడారి జగ్గారావు, బొడ్డేడ జగ్గారావుతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

సుంకపూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



సుంకపూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరంలో వైద్య సిబ్బంది

కోటవురట్ల: సుంకపూరు గ్రామంలో విశాఖకు చెందిన హోమీబాబా ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. హోమీ బాబా ఆస్పత్రి వైద్యులు కె.నమిత, మానసి, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎస్.సంతోష్‌కుమార్, డాక్టర్ ఆర్.ప్రత్యూష రోగులను పరీక్షించి మందులు అందజేశారు. క్యాన్సర్ లక్షణాలు, కారకాలు, జాగ్రత్తలను రోగులకు వివరించారు. అవగాహనతోనే క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. ఈ శిబిరంలో 34 మందిని పరీక్షించి మందులు అందించారు. ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, సర్పంచ్ చిటికెలి కాశీలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం అందలాపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ 17వ వారికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పూజల్లో సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు బి.వి రమణ, కొల్లి అప్పారావుపాల్గొన్నారు. కోలాట భక్తుల ప్రదర్శన ఆకట్టుకుంది.

సామాజిక తనిఖీ ప్రజా వేదికలో సమస్యల వెల్లువ



సామాజిక తనిఖీ రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సందీప్

పాయకరావుపేట : మహాత్మాగాంధీ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల పరిషత్ ఆవరణలో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి డ్వామా పీడీ ఇ.సందీప్, జిల్లా విజిలెన్స్ అధికారి సిహెచ్.నిర్మలదేవి ప్రజా వేదికలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. గ్రామాల్లో ఉపాధి పనులు చేయించే వీఆర్పీలు సక్రమంగా రికార్డులు రాయలేదని, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించడం జరిగిందని వెల్లడించారు. ఆయా గ్రామాల్లో సామాజిక బృందం నిర్వహించిన తనిఖీలు, గ్రామ సభల్లో అవకతవకలపై ప్రజా వేదిక ఎదుట వెల్లడించారు. మంగవరం, పెంటకోట, మాసాహెబుపేట, కేశవరం గ్రామాల్లో వీఆర్పీలు సక్రమంగా ఉపాధి హామీ పనులు చేయించలేదని, రికార్డులు రాయలేదని వెల్లడించారు. అరట్లకోట గ్రామంలో చనిపోయిన వ్యక్తుల పేరున కూడా ఉపాధి కూలీ వేతనాలు తీసుకున్నట్టు వెల్లడించారు. కేశవరంలో ప్రతిపాదనలు లేని పనులు చేయించడం జరిగిందన్నారు. కేశవరంలో ఉపాధి హామీ కూలీల వద్ద డబ్బులు తీసుకుంటున్నట్లు తనిఖీ బృందం వెల్లడించింది. శ్రీరాంపురం గ్రామంలో భర్త వుండగానే భార్య వితంతు పింఛను తీసుకున్నట్టు బృందం వెల్లడించింది. చనిపోయిన వారి పేరున కూడా ఉపాధి కూలీ సొమ్మును తీసుకున్నట్టు వెల్లడించారు. అదే విధంగా నామవరం, ఈదటం గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అనేక అవకతవకలు జరుగుతున్న అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, ప్రజావేధికలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా పలు గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నట్లు రికార్డులు ద్వారాను, గ్రామ సభల ద్వారాను తమ దృష్టికి వచ్చినట్లు తనిఖీ బృందాలు వెల్లడించాయి. తనిఖీ బృందాలు వెల్లడించిన నివేదికలపై స్పందించిన డ్వామా పీడీ సందీప్ మాట్లాడుతూ నిధులు దుర్వినియోగం, అవినీతి పై తుది నివేదిక తయారు చేసి వారి వద్ద నుండి రికవరీ గాని, పెనాల్టీలు గాని చేయడం జరుగుతుందన్నారు. వీరి పై చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం పివి రమణ, ఏపీడీ డి.వి.యరకయ్య, ఏపీవో హేమలత, ఎంపీడీవో కె.స్వప్న, జెడ్పీటీసీ లంక సూరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి మండలంలో 1254 ఉపాధి హామీ పనులు చేపట్టడం జరిగిందని అన్నారు వాటిలో రూ.6 కోట్లు ఉపాధి హామీ కూలీలకు, మరో 2 కోట్ల 2 లక్షల రూపాయలు సామాగ్రి వినియోగానికి ఖర్చు చేయడం జరిగిందని ఏపీవో హేమలత తెలిపారు.

డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



కైలాసపట్నంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

కోటవురట్ల : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పని చేయాలని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి అన్నారు. కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అన్నారు. వార్డు మెంబర్ కుందూరు నూకరత్నం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : అరట్లకోటలో శనివారం భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సందడి చేశారు. డప్పు కళాకారుల డప్పు వాయిద్యాలు అలరించాయి.

సాక్షి విలేకరిపై దాడి అన్యాయం



మాట్లాడుతున్న పలు పార్టీల నాయకులు

రాంబిల్లి : రాంబిల్లి సాక్షి విలేకరిపై యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దాడికి పాల్పడడంపై సర్వత్రా ఖండనలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నాయకుల మట్టి దందాపై వార్తలు రాసినందుకు కక్ష కట్టి దాడులకు పాల్పడడంపై పలువురు నాయకులు మండిపడ్డారు.

ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి

ఎమ్మెల్యే అధికారం చేపట్టి నెల రోజులు వ్యవధిలోనే నియోజకవర్గ ప్రజలు భయపడేలా వ్యవహరిస్తున్నారు. ఏకంగా సాక్షి విలేకరిపైనే దాడులకు దిగారు. తీరు మార్చుకోవాలి

–దేమునాయుడు, సీపీఎం మండల కార్యదర్శి

దాడులు అన్యాయం

సాక్షి విలేకరి బుదిరెడ్డి అప్పారావుపై ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దాడికి పాల్పడడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌రాజు అన్నారు. ప్రజాస్వామ్యంలో ఈ ఘటన చీకటి రోజులను తలపిస్తుందన్నారు. భారీ మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యే ఇటువంటి దాడులను ఆపకపోతే తీవ్ర స్థాయిలో ప్రతిఘటించడం ఖాయమన్నారు.

– పిన్నంరాజు కిషోర్ రాజు

జర్నలిస్టులపై దాడులు అమానుషం

జర్నలిస్టులపై దాడులు అమానుషం. ఇది మరోసారి కొనసాగితే ఎమ్మెల్యేను రోడ్లుపై తిరగనివ్వకుండా అడ్డుకుంటాం. ప్రజల ఓట్లుతో గెలిచి ప్రజాసేవ చేయాలే తప్ప దాడులకు తావు లేదన్న విషయం ఎమ్మెల్యే సుందపు విజయ్‌కుమార్ తెలిసుకోవాలి

–ధూళి నాగరాజు , జెడ్పీటీసీ రాంబిల్లి మండలం

అనుమతుల్లేని ఎరువులు అమ్మితే చర్యలు



అడ్డురోడ్డు ఎరువులు దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎస్.రాయవరం : ఎరువుల దుకాణాల్లో అనుమతులు లేని ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ జిల్లా స్పెషల్ టీమ్ సభ్యులు సీహెచ్ చౌదరి అన్నారు. అడ్డురోడ్డు ఎరువుల దుకాణంలో శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌ల్లో రైతులను మోసం చేసే సంఘటనలు జరిగితే ఎరువులు దుకాణదారుల లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో రంపచోడవరం ఏడీఏ ఎ. రవిప్రసాద్, వ్యవసాయాధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ సౌకర్యం కల్పించాలి




మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యలమంచిలి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

యలమంచిలి : యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి ఎక్స్‌ప్రెస్ బస్సుల హాల్ట్ కల్పించేలా మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు చొరవ చూపాలని యలమంచిలి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రభాకరరావుకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం పంచాయతీ ఆధీనంలో ఉన్న సుమారు రెండున్నర ఎకరాల స్థలాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం నిమిత్తం అందజేయడమైందని, ఆ స్థలంలో ఆర్టీసీ వారు కాంప్లెక్స్ నిర్మించగా, మిగిలిన స్థలాన్ని వ్యాపారులకు అద్దెకు ఇచ్చి ప్రయాణికుల ప్రయోజనాలు గాలికొదిలేశారని తెలిపారు. యలమంచిలి పట్టణంలో ఫ్లైఓవర్ ఇటీవలే ప్రారంభమైందని ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌లు మాత్రం పట్టణంలోకి రాకపోవడంతో ఇక్కడ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్‌లను యలమంచిలి పట్టణంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాజీవ్ క్రీడా మైదానం వద్ద గేట్లు తీసి ఉండడం వల్ల అక్కడ స్థానికులు మూత్ర విసర్జన చేసి స్వచ్ఛ భారత్‌కు విఘాతం కలిగిస్తున్నారని, దీనిపై పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆడారి పూరీ జగన్నాథం, రత్నరాజు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన

ఎంపీ రమేష్, ఎమ్మెల్యే విజయకుమార్



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ రమేష్

మునగపాక : ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సేవలందిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మునగపాకలో ఎన్‌డీఏ కూటమి విజయోత్సవ వేడుకలను శనివారం రాత్రి నిర్వహించారు. అనకాపల్లి బైపాస్ నుంచి ఎంపీ రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు ఊరేగింపుగా సభాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు శత శాతం అమలు జరిగేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల ఆశయాలకు అనుగుణంగా సేవలందిస్తామన్నారు. సమావేశంలో టెక్కలి పరశురామ్, దొడ్డి శ్రీనివాసరావు, దాడి మునిలినాయుడు, విజయ్ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో హైస్కూల్ పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేబిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఈ విషయంలో యజమానులు నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. ఎంఈవో వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎం.మన్మథరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపర్తిలో తుప్పల తొలగింపు



గణపర్తిలో తుప్పల తొలగింపు పనులు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి దుర్గ

మునగపాక : మండలంలోని గణపర్తిలో శనివారం తుప్పల తొలగింపు పనులు చేపట్టారు. పేరుకుపోతున్న తుప్పల కారణంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జనసేన మండల ప్రధాన కార్యదర్శి కాళ్ల చంద్రమోహన్ సారధ్యంలో శ్రమదానం నిర్వహించారు. పొక్లెయిన్ సాయంతో కాలువలు శుభ్రం చేయించారు. పంచాయతీ కార్యదర్శి దుర్గ దగ్గరుండి సంబంధిత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జనసైనికులు వెంకునాయుడు, అప్పలరాజు, దిలీప్, ప్రసాద్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

అచ్యుతాపురం : ప్రజా సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేద్దామని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అందరూ పార్టీలకతీతంగా కలిసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ రాము, ఎంపీడీవో సురేశ్‌కుమార్, మండల పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

డయేరియా బాధితుల్ని ఆదుకోవాలి

అచ్యుతాపురం : మండలంలోని మోటూరు పాలెం డయేరియాకు గురైన వారిని ఆదుకోవాలని సీపీఎం నాయకులు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. తక్షణమే డయేరియాను అదుపులోకి తీసుకొని బాధితులకు సాయం చేయాలని కోరారు.

వరిలో యాంత్రీకరణ పద్ధతులపై అవగాహన



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీకాంత్

మునగపాక : వరిలో యాంత్రీకరణ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని శాస్త్రవేత్త శ్రీకాంత్ కోరారు. మండలంలోని తిమ్మరాజుపేటలో బీసీటీ కృషి విజ్ఞానం అలాగే రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో వరిలో యాంత్రీకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సమస్య ఉన్నందున యంత్రాల ద్వారా సాగు చేసేందుకు రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి రైతు తమ కున్న భూమిలో పది సెంట్ల మేర ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రామచంద్రరావు, బీసీటీ సామాజిక కార్యకర్త ఎ.నాయుడు, ట్రైనర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



వైఎస్సార్ జన్మదినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగతా శ్రీనివాస్

పాయకరావుపేట : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేదల పక్షపాతి అని, ఆయన 75 వ జన్మదినోత్సవం సందర్భంగా ఆ మహనీయుని సేవలు స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పీసీసీ జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయవాడలో జూలై 8వ తేదీన వైఎస్సార్ జన్మదినోత్సవాలు కాంగ్రెసు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి పాయకరావుపేటలో ఉన్న కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్తమాన రాజకీయ నేతల్లో, సంక్షేమంతో ప్రజల మనసుల్లో తనదైన ముద్ర వేసిన ఘనత ఒక్క వై.ఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఓటమి ఎరుగని నేతగా, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, డ్వాక్రా రుణాలు, మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు వంటి వాటిని పేదలకు ఇచ్చి వారికి బంగారు భవితను అందించారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జూలై 8వ తేదీ నిర్వహించనున్న వైఎస్సార్ జయంతి వేడుకల పోస్టర్‌ను జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నేతలతో పాటు జాతీయ స్థాయి నేతలు వివిధ రాష్ట్రాలకు చెందిన వైఎస్సార్ అభిమానులు, ఆప్తులు జననేత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారని అందరికీ ఇదే మా ఆహ్వానం అని అన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పోలవరపు అప్పలరాజు, తవ్వ వీర్రాజు, తాతీలు, ప్రసాద్ కుమారుడు నాగేశ్వరావు, సత్తిబాబు, కాంగ్రెసు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డయేరియా రహిత సమాజం కోసం పాటుపడాలి



తిమ్మరాజుపేటలో డయేరియా నిర్మూలన ర్యాలీ



మునగపాకలో డయేరియాపై జాగ్రత్తలు తీసుకోవాలంటూ పోస్టర్ల ప్రదర్శన

మునగపాక : డయేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్ రాణి ఆధ్వర్యంలో తిమ్మరాజుపేటలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే అంటువ్యాధుల సోకకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీటీసీ శరగడం అప్పల నరసమ్మ కోరారు. సీజన్‌లో రోగాలు సంభవించకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, బీవీ రమణ, పచ్చికూర నరసింగరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మునగపాక సంతబయిల అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ ఏఎన్ఎం రేవతి పోస్టర్లు ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ఆడారి గోవింద్, ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, ఆశ కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు యాంటీ రాబిస్ టీకా తప్పనిసరి



కోటవురట్లలో కుక్కకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ సింహాద్రప్పడు

కోటవురట్ల : పెంపుడు జంతువులకు తప్పనిసరిగా నిర్దేశిత కాలంలో యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించాలని పశు సంవర్ధకశాఖ ఏడీ సింహాద్రప్పడు కోరారు. 'వరల్డ్ జూనోసిస్ డే' సందర్భంగా శనివారం కె.వెంకటాపురం, పాములవాక, తంగేడు వైద్య శాలల్లో ఉచితంగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేశారు. స్థానిక పశు వైద్యశాలలో ఏడీ సింహాద్రప్పడు ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలే కదా అని అశ్రద్ధ చేయకూడదన్నారు. పెంపుడు కుక్కలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు. మండలంలో మొదటి రోజున 54 పెంపుడు కక్కలకు వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం వారం రోజుల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యుడు ఆర్.ప్రతాప్‌కుమార్, ఎల్ఎస్ఎ జి.శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధి యూనిట్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

కోటవురట్ల : తంగేడులోని విశాఖ విత్తన శుద్ధి కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖాధికారులు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. శుద్ధి చేసిన విత్తనాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. యంత్రాలు, రికార్డులను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు యంత్రాలను తనిఖీ చేసి మంచి కండిషన్‌లో ఉండేలా చూడడంతో పాటు అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గుంటూరు కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్టు జిల్లా వ్యవసాయ నాణ్యత తనిఖీ బృందం అధికారులు సి.సి.చౌదరి, రవిప్రసాద్ తెలిపారు. నిబంధనల మేరకు యూనిట్ నడుస్తోందని నాణ్యత విషయంలో సూచనలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ రంగాచారి, వ్యవసాయధికారి సరోజిని, యూనిట్ సభ్యుడు చిటికెల పాత్రునాయుడు పాల్గొన్నారు.

152 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అవగాహన



యలమంచిలి ఏరియా పశు వైద్యశాలలో పెంపుడు శునకాలకు టీకా వేస్తున్న ఏడీ గంగాధర్,సిబ్బంది



శునకానికి యాంటీ రేబిస్ టీకా వేయిస్తున్న యువకుడు

యలమంచిలి రూరల్ : జూనోసిస్ డే సందర్భంగా శనివారం యలమంచిలి ఏరియా పశువైద్యశాలలో తమ పెంపుడు శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సినేషన్ వేయించారు. ఉదయం 9 గంటలకు ఏరియా ఆస్పత్రి ఏడీ డాక్టర్ గంగాధర్ శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. శునకాల యజమానులు,ఏరియా ఆస్పత్రి పక్కనే ఉన్న కొత్తపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు జూనోసిస్ డే ప్రాధాన్యతను ఆయన వివరించారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ గురించి వివరించారు. రేబిస్ సోకని వీధి కుక్కలు కరిచినా వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. తప్పనిసరిగా కుక్క కాటుకు గురైన వ్యక్తి నిర్దేశిత యాంటీ రేబిస్ వ్యాక్సిన్ డోసులు వేయించుకోవాలన్నారు. శుక్రవారం మొత్తం 152 పెంపుడు శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వై మీనాక్షి, ప్రధానోపాధ్యాయుడు రమణ, సునర్ల సూర్య ప్రకాష్, ఏరియా పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.